# తోచిందల్లా - - - - ★

శ్రీ కొనకళ్ల వెంకటరత్నంగారు

ఆమె అంటే నాకెంతో భక్తి ప్రపత్తులున్నాయి. ఆమె కాంగ్రెస్‌వాది. చాలాసార్లు జైళ్లకి వెళ్లింది. ఆమె అంటే నాకేకాదు, చాలామందికి పూజ్య భావం. ఆమె మనస్సు వెన్నలాంటిది. ఆమె పెనిమిటికి మళ్లీ వూరూ పేరూ లేదు. ఆమె ఏకాన్ఫరెన్సుకు వెళ్లినా ఆయన కూడానే వుంటాడు. కొంతవరకూ ఆయన ఇచ్చిన స్వతంత్రంవల్లనే ఆమె స్త్రీలోకంలో వొక మణిపూసగా తయారయింది. అయితే ఆమె కొకనాడు తీరని అవమానం కలిగింది నా యెదుట. ఒక సేవాసదనానికి శంఖుస్థాపన చేశేందుకు ఆహ్వానించారామెని. ఆమె, ఆమెతో ఆయన వెళ్లారు. ఇట్లాంటి పురుష పుంగవుల్ని 'పక్షీంద్రు'లని పిలవటం వాడుకలో వుంది. కాని ఆ నామధేయం మాత్రం నాకు రుచించదు చెప్పొద్దూ. వొక స్త్రీని వున్నతమైన శ్రేణిలో నిలిపి తాను నిమిత్తమాత్రంగా వుండిపోయే పెద్దమనిషిని హేయంగా చూస్తాము మనం. అది తప్పు. వొకనాడు మా శంకరానికి సిగరెట్టివ్వబోయాము. పుచ్చుకోనన్నాడు. మానేశానన్నాడు. "ఎప్పటినించిరోయ్!" అని నిగ్గదీశాము. "మా అవిడ శతపోరు పెట్టింది - నిన్నటినించీ మానేశానన్నాడు" అప్పైన అందరమూ వేటకుక్కల్లా మీద పడ్డాము

"ఓరి వెధవ!—చచ్చు సన్యాసి!" అని వొకడు.

"ఇంటిదగ్గర ఆడముండ శాసించిందీ?" అని మరొకడు.

"నువ్వు మొగుడు మంటున్నావా?" అని ఇంకొకడు.

"ఇక నువ్వెందుకు పనికొస్తావురా?" ఐక్య కంఠంగా.

"ఆడంగి వెధవ!" అని నా వుపసంహార వాక్యం!

అదే వొక స్త్రీ తనభర్త కిష్టమయిన ప్రియురాలి దగ్గరకు అతన్ని నెత్తినమోసికెళ్లి దిగవిడచిందనుకోండి. ఆమెకి పతివ్రత అని తక్షణం నామకరణం చేస్తాము. దాన్ని వోపురాణకథకింద అల్లిపారేస్తాము; అల్లి మంచి డైరెక్టరుచేత ఫిలిము తీయిస్తాము. మన ఫిలిములన్నీ ఇప్పుడు పురాణయుగంలో వున్నాయిగా. ఆ ఫిలిముకి ముఖ్యంగా స్త్రీలే ఎక్కువ మోజరవుతారు, జనం తండోప తండాలుగా వొచ్చి చూస్తారు. ఫిలుముకి మొట్టమొదటి విడుదలలోనే తయారీ ఖర్చులు పోను లక్షా ఏభైవేలు మిగులుతాయి.

"అసలు విషయానికి రావేమిటి?" అంటుంది పాపాశి. అసలెక్కడెత్తుకున్నానూ? ఆఁ... వొస్తున్నా—వొస్తున్నా. సేవాసదనమూ, శంఖుస్థాపనా...అప్పుడు నేనూ వున్నానక్కడ. తతంగమంతా అయిపోయింది. ఆమె కాంగ్రెస్ వాది. అందుచే చాలమంది కాంగ్రెస్ వాదులు వొచ్చారా సమావేశానికి. అదిసహజం. సాయంత్రపువేళ వారంతా వొచిన్న తేనీటివిందు ఏర్పాటు చేసుకున్నారు తోటలో. ఆమెకూడా వెళ్లవలసివుంది. బయలుదేరవలసిన టైము కావచ్చింది. వాళ్లంతా కిందహాల్లో తొందర పడుతున్నారు. ఆమె ఎంతయినా స్త్రీ—కొడుకులూ, మనుమలూ కూడా వున్నారామెకి-అయినా "Woman's love of beauty is something sacred" అన్నాడొకనాడు మా సచ్చిదానందంపిళ్లె కాలేజీలో. ఆమె అలంకరించుకుంటోందనిఅనను. కాని స్త్రీ, అందునా, నలుగుర్లో మెలగవలసిన దేశసేవిక, అందుచే శుభ్రంగా వుండాలన్న తాపత్రయంలో కొంత కాలయాపన చేసినమాట నిజం. ఇంతట్లో ఆయనొచ్చాడు! ఎక్కణ్ణించో-ఆదరా బాదరా వొచ్చి ఫెఢేమని అన్నాడొక మాట "వెధవ ముండా—ఇంకా తయారు కాలేదా?—వాళ్లంతా తొందర పడుతున్నారక్కడ" అన్నాడు చట్టునా యెదట! నే నున్నానన్న జ్ఞానమైనా లేకుండా!! పెద్ద గలాటా జరుగుతుందనుకున్నాను నిజంగా. అంతమాట సహిస్తుందా అనుకున్నాను. వెనక వో సాహితీసభలో కృష్ణశాస్త్రిగారు వుపన్యసిస్తూ టాగూరునీ, మహాత్మాగాంధీనీ దేశానికెట్లాంటివాళ్లో వివరించడంలో గాంధీజీని తమయింట్లో ఎప్పుడూ బుద్ధులు చెబుతుండే వితంతు పిన్నితో పోలుస్తూ స్త్రీలని గురించీ, చాదస్తపు వితంతువుల్ని గురించీ హేళన పూర్వకంగా స్పృశించి నట్టనిపించింది. తారాజువ్వలా లేచిందీమె. ఆపళంగా వోదణ్ణంపెట్టి యుక్తిగా తప్పుకున్నాడంత పెద్ద కవీను. అట్లాంటి ఆమె ఏమీలేదు "ఇదిగో వచ్చే... అయిపోయింది—అయ్యో . ..." అన్నదంతే-చిరునవ్వు

నవ్వులో-కుచ్చిళ్లు సరిచేసుకొంటో-అచ్చంగా మా ఆవిడకి మల్లేనే! నాకు చిన్నతనమయిపోయింది చెప్పొద్దూ-మధ్య నాకు బావుంది కాదు.

"మరి నీకు ఆవిడంటే పూజ్యభావమన్నావు. భక్తి భావమన్నావు. అట్లాంటి ఆమెని పెనిమిటయితే మటుకు అంతమాట పెళ్లుమని అనేస్తుంటే చూస్తో చెవులప్పగించి వూరుకున్నావా?" అంటుంది పాపాజీ.

కొంపమునిగింది. ఇట్లా ఇరుక్కున్నానేమిటి? అనాలి సిందే ఆయన్ని. "ఏమిటయ్యా-ఆమె అంటే మేమెంతో వున్నతంగా, పవిత్రంగా చూచుకుంటున్నాము. నువ్వేమో ఆవిడలో సహస్రాంశం చెయ్యవు. ఆమెను పట్టుకుని, ఇంత అనాగరికంగా, ఇంత అసభ్యంగా అనరాని మాటలంటావా?" అని ఝూడించాలిసింది. కాని, వెధవ మతి మరుపు! నాకీ వంక వకటున్నదిగా-ఆ సమయానికి ఆయన, ఆమె భర్తగారు అన్నమాటేగాని ఆమె నా దేశంకోసం, దేశ స్వాతంత్ర్యంకోసం పోరాడుతున్న వొక వీరవనిత అన్న గుర్తేలేదు. ఆ సంఘటన తర్వాత నేననుకొంటో వుంటాను-ఈ మంత్రిత్వాలు వెలిగిస్తున్న స్త్రీలు, చైర్‌మన్లు చేసిన విదుషీ మణులు, మహిళామండలి సెక్రటరీలు, జెండా లెగరేశే దేశసేవికలు, వుద్యమాలు నడిపే వీరాంగనలు వీళ్లంతా మా ఆవిడికి మల్లేనే ఇంటో మాటలు పడుతూవుంటూరా అని సందేహం నాకు. వీళ్లందర్నీ స్వతంత్రులననా, అస్వతంత్రులననా ఏమనాలీ అని?

"సర్కస్ సింహాలు" అంటుంది పాపాజీ. నిజమే ఆట వేళకి ఎరీనాలోకి రావడం, ఆటయిందాకా, ఎరీనాలో వొళ్లు విరుచుకుని స్వేచ్ఛగా నటించడం, ఆటయి పోగానే హంటరుముందు బోనులో దూరి నిశ్శబ్దంగా పడుకోవడం. ఇంతేనా?

"సరేలే-పోస్టుమేన్ వొచ్చాడు చూడు" అంటోంది పాపాజీ. శుభలేఖ. నాగేంద్రుడుగారబ్బాయికి మళ్లీ పెళ్లి కుదిరిందట. అసలు ఆ మొదటిభార్య చచ్చిన మర్నాటి నించే సంబంధాలొచ్చాయట. పైగాపరమపదించినధర్మపత్ని చితిమీద దగ్ధపటల మయిపోతూ వుండగనే అక్కడ సమావేశమైన బంధుకోటి మాట్లాడుకోవాలట! ఏమనీ? "అక్కడాపిల్ల వున్నది. ఇక్కడీపిల్ల వున్నది. ఆ పిల్లయితే ఈడూ, ఈ పిల్ల సాంప్రదాయం మంచిది-" ఈ ధోరణిలో. ఎంత క్రూరమైన ఆచారం.

"పురుషుడికి అనుకూలమైన ఆచారం" అంటుంది పాపాజీ. కాదుమరీ? ఆట్లా మాటలు జరుగుతుంటే, అక్కడికి చచ్చినావిడ అంతరాత్మ తృప్తిపొందుతుంది-అమ్మయ్య-ఇక మా ఆయనికి అట్టే నాగాలు లేకుండా సంసారం అవిచ్ఛన్నంగా సాగిపోయే సదుపాయమమిరింది అని శాంతి పొందుతుంది. ఆయన మళ్లీ పెళ్లిపీటలెక్కేదాకా ఆవిడగారి ఆత్మ అట్లా ఆవేదన పొందుతో వుంటుందన్నమాట పాపం. ఈఆచారానికి పునాదిరాళ్లు వేసిన ఋషులు ఎవరో గాని పురుషుడికి ఇబ్బందంటే ఎంత సానుభూతి! ఇకను, మొగుడు చచ్చీచావగానే స్త్రీకి ఎక్కణ్ణించో వొక విధవకళ రాంబందులా వొచ్చి వాలుతుందట మొహాన్ని. అసలు పెనిమిటి హరీ అంటాడనగానే పుణ్యస్త్రీకళ ఆమె ముఖారవిందంమీద ముందరగానే తొలిగిపొయ్యే సూచన్లవుపిస్తాయట స్పష్టంగా. అది మూటాముల్లె సర్దుకోవడము గట్టా ఆ చప్పుడుగూడా వినిపిస్తుందట. ఇహ చావగానే టుపీమంటో రెక్కలు గట్టుకుని ఎగిరిపోతుందంతే. ఇప్పుడిప్పుడు మాత్రం ఆ పుణ్యస్త్రీకళ అట్లా హడావిడిగా లేచిపోకుండా నాలుగు రోజులు పస్తాయించి అట్టేవుంటోంది. లేకపోతే ఆపిల్ల తీరా రెండో పెళ్లి చేసుకుందుకు సంకల్పించిందంటే మళ్లీ వెనక్కి తిరిగి రావాలసొస్తుందిగా!

ఆరోజు ప్రొద్దుట తెలిసింది నాకు, చంద్రంగారు రెండో పెళ్లిచేసుకుందుకు వొప్పుకున్నదట, భార్య కనకమ్మ. ఆయనకి సంతానంలేదు పాపం. 3 వేల ఎకరాలు వున్నది. అటు విశాఖపట్నంనుంచీ ఇటు మెడ్రాసుదాకా ఫ్యాక్టరీ లేనా, కార్ఖానాలేనా వందలున్నా యాయనకి. ఆమె మొన్నటిదాకా పెనిమిటి రెండో పెళ్లి చేసుకుందుకు వొప్పుకోలేదట; పొలాలూ అవీ చేస్తున్న రైతులకీ, ఫ్యాక్టరీలు గట్టా, అవినడుపుతున్న పనివాళ్లకీ, రాసిచ్చేదామంటుంది తమ అనంతరం-ఆయనకీ, ఇహ సరేసరి—ఆయన తల్లీ, మరి ఇతర బంధువర్గానికీ "పుత్" అనే నరకం నోరు తెరుచుకుని కనబడుతోంది గడియ, గడియకూను! అందులోనూ ఆ సిస్టా

# తోచిందల్లా

వారి మేనగోడల్ని చూచిందగ్గర్నించీ ఆయనకి ఆ నరకం తాలూకు, నోట్లో కోరలుకూడా మొలచినట్లు భీతావహంగా వుంటోంది. అందుచే, ఇక ఫైసలయిపోతుంది ఆ సంబంధం. ఆవిడ తన భర్త ద్వితీయ వివాహానికి అంగీకరించలేదని ఆమెనితిట్టనివాళ్లు లేరు ఇంతవరకూ.

"ఇంతకీ ఆమె వొప్పుకున్నమాట నిజమేనా?" అంటుంది పాపాజీ. కాకపోవచ్చుకూడా. ఒప్పుకోకపోతే ఆగుతుందా? వొకవేళ లోపల ఇష్టం లేకపోతేమటుకు సరేననిపించేందుకు అదో బ్రహ్మ ప్రళయమా? ఆమె ఏదో కోరకరాని కొయ్య గనక సరిపోయింది గాని మామూలు కులకాంత అయితే రెండు రోజులలో అవుననిపించి ఇంటి ముందు పెళ్లి పందిరి లేపెయ్యదూ? ఆయనకి మటుకు గట్టి నమ్మకమే, సిష్టావారిసంబంధంతో సంతానప్రాప్తి కలుగుతుందని. ఆ నమ్మకమట్లా వుంటుంది లెండి. కంటికి నదరుగా మరోపిట్ట కనిపించేదాకా అసలు సంతానప్రాప్తికి లేని కారణాలు, మెద్రాసు మింటువీధిలోనుంచీ, బొంబాయి సఫేదు గల్లీనించీ, వొంట్లోకి దిగుమతయిన కారణాలు తన దగ్గిర పెట్టుకుని పున్నామనరకానికి భయపడుతున్నట్టు నటిస్తుంటే నవ్వొచ్చేదినాకు.

"ఇట్లాంటి నరకం ఆడదాని కోటి లేదుకాబోలు" అంటుంది పాపాజీ. వుంటే బాగానే వుండును. అప్పు డివారోగం కుదురును "ఏమయ్యోయ్—నీతో పదేళ్లనుంచీ కాపురంచేస్తున్నాను. సంతానంలేదు చట్టు బండలులేదు. నేనింకొకర్ని కట్టుకుని బిడ్డలు కంటాను. మరి ఏమంటారు?" అని అడిగేది. అన్నన్నా! ఎంతమాటంటీ అని ముక్కుమీద వేలేసు కుందుము.

★

(61 వ పేజీ తరువాయి)

ఒప్పుకున్నా మన ధర్మ శాస్త్రాలు ఒప్పవు. పోనీ మన ధర్మశాస్త్రాలు ఎప్పుడో వాళ్లకాలంలో ఆ నాటికి సరిపడ్డట్లు వాళ్లు వ్రాసికొన్నారు. ఇప్పుడు మనం వాటిని పాటించడ మెందుకు, ఈ కాలము ననుసరించి మనం వెళ్లాలికాని అనుకొంటే ఇప్పటి ఈ బ్రిటిషు 'లా' కూడా ఒప్పదట. ఏలాగే యీ పెండ్లి?

లీల : అమ్మా! భగవంతుడేర్పరిచిన ప్రేమను మానవ నిర్మితములైన ఈధర్మశాస్త్రములు, ఈబ్రిటిషు 'లా'లు ఇవేవీ అడ్డలేవు. ఒకవేళ పెండ్లి పనికిరాదంటే మాది ఆత్మసంబంధమైన ప్రేమగాని భౌతిక సౌఖ్యముల కొఱకు మాత్రమే యేర్పడిన ప్రేమ కాదు. కాబట్టి మాకు పెండ్లితో నిమిత్తమేలేదు. ఇరువురము పెండ్లి లేకుండా బ్రహ్మచారులముగానే యుంటాము. నాకు డబ్బుతో పనిలేదు. మనిషిని, మనిషియొక్క యోగ్యతను ప్రేమించానుగాని ధనమును ప్రేమించలేదు. ఒకవేళ బలాత్కారముగా నా శరీరమును మరియొకరి కంట గట్టవలెనని మీరు ప్రయత్నించినా అది మీకు సాధ్యముకాదు. నా మనస్సును మీరు మార్చ లేరు. అనక విచారించి లాభంలేదు. నేను గట్టిగా చెబుతోన్నాను.

ఇంట్లో ఎవరికీ కలెక్టరుగారి సంబంధం విడిచి పెట్టడం ఇష్టంలేదు. ఏవో ఇవన్నీ పుస్తకాల్లో చదువుకొన్న మాటలనీ ఊరికే అలా అంటుందేగాని పెండ్లయాక యేమి చేస్తుందనీ మహా చక్కగా ఉంటుందనీ అనుకొన్నారు. అందులోనూ ప్రసాదరావు పట్టు మరీ యెక్కువగా నున్నది. తన స్నేహితుడు, పెద్ద ఆఫీసరు, కుఱ్ఱవాడు, తన చెల్లెల్ని బాగా ప్రేమిస్తాన్నాడు. అలాటి వానిని వదులుకోటం ఏలాగా?

అతను వచ్చేరోజులు సమీపిస్తాన్నాయి. ఇక వచ్చాక పెండ్లిచేసికొని వెళ్లి పోవడమే. వ్యవధియుండదు. లీలఇంట్లో వెల్లలు వేయించడం, రంగులు వేయించడం, పెండ్లి పనులు చేయించడం హడావిడిలో నున్నారు. శ్యామ ప్రసాదు స్నేహితులెవరో అతనికి వ్రాశారు. లీలకు కలెక్టరుతో పెండ్లి అవుతుందని. అతనికి పరీక్షలయి పోయాయి. ఇక యింటికి రావాలని ప్రయాణ మవుతోన్నాడు. లీల కీయడానికి ఒక చక్కని ఫౌంటెన్ పెన్, మంచి చెమికీ వేసిన కాలిజోడు, బెనారెసు జాకెట్టు గుడ్డ కొన్నాడు. పోష్టుబంట్రోతు ఉత్తరం ఇచ్చాడు. ఉత్తరం విప్పుతో ఉంటే ఎందుచేతనో అతనికి చేతులు వణికాయి. మనస్సు గాబరా చెందింది. ఉత్తరం చదువుతోఉంటే కళ్ళ నీళ్లు క్రమ్మాయి.

* * *

(సశేషము).

★